ఇంటి చుట్టూ పెంకుల పైకప్పుతో భవంతి



పెంకుల పైకప్పుతో చల్లదనాన్ని ఇస్తున్న ఇల్లు



1977లో నిర్మించిన పెంకుటిళ్లు



దండేపల్లి మండలం మాదాపూర్‌లో మిద్దె ఇల్లు



అలనాటి ఇళ్లలో..చల్లగా.. హాయిగా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి. దీంతో పేదల ఇళ్లలో ఫ్యాన్లు, మధ్య తరగత ఇళ్లలో కూలర్లు, ఎగువ మధ్య తరగతి నుంచి సంపన్నుల ఇళ్లలో ఏసీలు 24 గంటలూ నడుస్తున్నాయి. అయినా వాటికింద ఉన్నంతసేపే వేడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. కాసేపు బయటకు వెళ్లినా వేడి తట్టుకోలేకపోతున్నారు. కానీ ఉమ్మడి జిల్లాలోని పాత కాలంనాటి ఇళ్లలో ఉంటున్నవారు మాత్రం మండువేసవిలోనూ చల్లగా.. హాయిగా ఉంటున్నారు. ఎక్కువ ఎత్తుతో కట్టిన మట్టి మిద్దెలు, ఎక్కువ గ్రీనరీతో నిర్మించుకున్న పురాతన ఇళ్లలో ఫ్యాన్ గాలి చల్లదనం సరిపోతుందని పేర్కొంటున్నారు. నాటి నిర్మాణ శైలి, నిర్మాణానికి ఉపయోగించిన సామగ్రి కారణంగా నేటికీ ఉష్ణోగ్రతలు ఎంత పెరిగినా ఆ ఇళ్లలో వేడిగా ఉండదని యజమానులు చెబుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



నిర్మల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లిలో ఇప్పటికీ అందంగా కనిపిస్తున్న పెంకుటిళ్లు

ఏసీ, కూలర్ అవసరం లేదు



మాదీ నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ. ఎస్సారెస్పీ రియాబిటేషన్ విలేజ్ కావడంతో 1977లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూములు కోల్పోయిన వారికి విశాలమైన ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మాది ఉమ్మడి కుటుంబం కావడంతో మా మామయ్యలు ఎంతో ఆసక్తితో చుట్టూ బంతి ఇల్లు నిర్మించారు. వేసవికాలంలో ఎలాంటి ఏసీ, కూలర్ అవసరం ఉండదు. అందుకే ఇప్పటికీ అతి పురాతనమైన ఈ ఇంట్లోనే నివాసం ఉంటున్నాం. – ఉమారెడ్డి, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

చల్లగానే ఉంటుంది



మా నాన్నలు ఇద్దరు అన్నదమ్ములు. మేము నలుగురం అన్నదమ్ములం. 1970లో కలిసికట్టుగా బంతి ఇల్లు నిర్మించుకున్నాం. అప్పటి నుండి ఇప్పటి వరకు మా అన్నదమ్ములం ఇదే ఇంట్లో కలిసే ఉంటున్నాం. ఇంటి పైకప్పుకు వేపచెక్కలు కొట్టి వాటిపై మట్టిముద్దలు వేసి పైన గూనపెంకలు పేర్చారు. అందుకే వేసవికాలంలో ఎండలు ఎంతగా ముదిరినా మా ఇంట్లో మాత్రం చల్లగానే ఉంటుంది. – లింగన్న, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

చల్లదనం పంచుతుంది



మాది రత్నాపూర్ కాండ్లి. మేము ఇద్దరం అన్నదమ్ములం. 1970లో రూ.50 వేలు ఖర్చుచేసి బంక మట్టి ముద్దలు, సున్నపురాయి కలిపి ఇంటిగోడలు నిర్మించాం. ఇంటి పైకప్పుపై మట్టిముద్దలు పేర్చి దానిపై గూనపెంకలు పేర్చాం. అందుకే వేసవి కాలంలో కూడా మాఇల్లు చల్లదనాన్ని పంచుతుంది. – ముత్తన్న, రత్నాపూర్ కాండ్లి, నిర్మల్

దంగుసున్నంతో నిర్మించాం



దండేపల్లి: మాది మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని మాదాపూర్. 90 ఏళ్ల క్రితం దంగుసున్నంతో మిద్దె ఇల్లు (భవంతి) నిర్మించాం. సాధారణ ఇళ్లకంటే ఎక్కువ ఎత్తులో నిర్మించాం. ఇప్పటికీ మాఇంట్లో ఫ్యాన్లు తప్పా కూలర్లు, ఏసీలు వాడం. మండు వేసవిలోనూ ఎంతో చల్లగా ఉంటుంది. 90 ఏళ్లు దాటినా ఇప్పటికీ చెక్కు చెదరకుండా ఉంది. – వీరమనేని సుభద్ర, మాదాపూర్, దండేపల్లి, మంచిర్యాల

వ్యవసాయరంగం బలోపేతానికి కృషి

- ఎంపీ గోడం నగేశ్



ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లి: వ్యవసాయ రంగాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పిట్టబొంగరంలో ఏర్పాటు చేసిన మన్‌కీ బాత్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన ప్రసంగాన్ని రైతులకు రేడియో ద్వారా వినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతుల ఆర్థికాభివృద్ధికోసం నిరంతరం కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే మన్‌కీ బాత్ కార్యక్రమంలో హార్టికల్చర్ విభాగంలో పండ్ల మొక్కల పెంపకంపై రైతులకు సలహాలు, సూచనలు చేయడం గొప్ప విషయమన్నారు. ప్రతీరైతు పండ్ల మొక్కల పెంపకంపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా పిట్టబొంగరం, దస్నాపూర్, ధర్మగూడ, బట్టగూడ గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని గ్రామస్తులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు, నాయకులు మారుతి దేవ్‌పూజే, శివకుమార్ జైస్వాల్, ముండే రాజేశ్వర్, దిలీప్ మోరే, రాథోడ్ భీంరావ్, మెస్రం తుకారాం, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్, గేడం యేశ్వంత్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలతో క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: ఈనెల 24 నుంచి 26 వరకు హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ 7వ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఆదివారం క్రీడాకారులు మంచిర్యాల రైల్వేస్టేషన్‌కు చేరుకోగా అసోసియేషన్ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు. జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన అమూల్య, కోచ్ సునార్కర్ అరవింద్, మేనేజర్ సాయిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోనె శ్యాంసుందర్‌రావు, ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్, కోశాధికారి రమేశ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రెటరీ రఘునాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బాల కేంద్రానికి చెందిన చిన్నారులు జాతీయస్థాయి నృత్య పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మహారాష్ట్రలోని వార్ధాలో ఈనెల 25, 26 తేదీల్లో రాష్ట్రీయ కళామంచ్, సచిన్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి నృత్యోత్సవ పోటీల్లో విజేతలుగా నిలిచారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో కూచిపూడి ఈవెంట్లో దువాస హర్షిని, కోండ్ర అలేఖ్య ప్రథమ స్థానంలో, జాహ్నవి క్షీరసాగర్ ద్వితీయ స్థానంలో నిలిచినట్లు బాలకేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలిపారు. జూనియర్ విభాగంలో ప్రథమస్థానంలో వర్ధిని, ద్వితీయ స్థానంలో శ్రీనిధి, సబ్ జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో ఇతీక్ష కొంకటి, ద్వితీయ స్థానంలో రితీక్షా జంగిలి, ప్రాపర్టీ రౌండ్లో సన్నిధి దేశ్‌ముఖ్, హర్షిని ఠాకూర్ ప్రథమ స్థానంలో నిలిచారు. మహారాష్ట్ర వేదికగా జరిగిన పోటీల్లో బాలకేంద్రం చిన్నారులు ఇప్పటివరకు మూడు పర్యాయాలు ప్రథమ స్థానంలో నిలిచారని నిర్వాహకులు వెల్లడించారు.

కల్మలపేటలో వృద్ధుడి హత్య!

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



బద్ది లచ్చయ్య(ఫైల్)



రక్తపు మడుగులో లచ్చయ్య మృతదేహం

వేమనపల్లి: గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో వృద్ధుడు హత్యకు గురైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కల్మలపేటకు చెందిన బద్ది లచ్చయ్య (64) మొదటి భార్య మధునక్క మృతి చెందగా లక్ష్మి అనే మహిళను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు భార్యలకు నలుగురు కుమారులు నారాయణ, పోచన్న, రాములు, తిరుపతి ఉన్నారు. లచ్చయ్య కౌలు వ్యవసాయం, గుడుంబా అమ్ముకుంటూ అదేఇంట్లో వేరే గదిలో ఉంటున్నాడు. శనివారంరాత్రి చిరుజల్లులు కురుస్తుండగా తన ఎక్స్‌ఎల్ వాహనంపై బయటకు వెళ్లివచ్చాడు. తెల్లారేసరికి ఇంట్లో రక్తపు మడుగులో పడి ఉన్నాడు. గమనించిన కోడలు సమ్మక్క ఏడుస్తూ కొడుకులకు చెప్పడంతో విషయం బయటకు పొక్కింది. గుర్తు తెలియని వ్యక్తులు హత్యకు ఉపయోగించిన ఎడ్లబండికి ఉండే గడుగొయ్య అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. పెద్ద కొడుకు నారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. ఘటన స్థలాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు , చెన్నూర్‌రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్ పరిశీలించారు.

‘గిరి’ విద్యార్థులకు ఏఐ బోధన

- నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ
- రాష్ట్ర వ్యాప్తంగా 15 బ్యాచ్‌లు
- ఉమ్మడి జిల్లాలో 1,450 మందికి తర్ఫీదు

ఐటీడీఏ పరిధిలోని గిరిజన పాఠశాలలు, ఉపాధ్యాయుల వివరాలు
రెగ్యులర్ ఉపాధ్యాయులు : 878
అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు : 26
సీఆర్‌టీలు : 528
ఉన్నత పాఠశాలలు : 126
ప్రాథమిక పాఠశాలలు : 950



ఆసిఫాబాద్‌లోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల

కెరమెరి(ఆసిఫాబాద్): విద్యావ్యవస్థలో నూతనంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకునేందుకు గిరిజన సంక్షేమశాఖ సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో గిరిజన విద్యార్థులకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ) ద్వారా విద్యాబోధన అందించాలని భావించింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏ పరిధిలోని ప్రాథమిక, ఆశ్రమోన్నత పాఠశాలల్లో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, సీఆర్టీలు, అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు నేటి నుంచి ఆన్‌లైన్ మాధ్యమంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు 15 బ్యాచ్‌లను తయారు చేశారు. ఒక్కో బ్యాచ్‌కు 350 నుంచి 400 మంది టీచర్లు క్లాసులు వినేలా ప్రణాళికలు చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయులు ఈ నెల 26, 28 తేదీల్లో ఏఐటూల్స్‌పై శిక్షణ పొందనున్నారు. ఇప్పటికే జిల్లా పరిషత్ లోకల్ బాడి పాఠశాలల్లో ఎంపిక చేసిన 3, 4, 5వ తరగతుల విద్యార్థులకు ఏఐ విద్య కొనసాగుతుండగా కొంతమార్పు వచ్చింది. రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెరిగాయి. గణితంలోనూ లెక్కలు చేయగలుగుతున్నారు. ఇదే తరహాలో గిరిజన ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏఐ విద్యాబోధన అందించాలని గిరిజన సంక్షేమశాఖ సంకల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి మే 30 వరకు ఆన్‌లైన్ తరగతులు కొనసాగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5,560 మంది ఉపాధ్యాయులు ఏఐపై శిక్షణ తీసుకోనుండగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలో గల 1,450 మంది ఆన్‌లైన్ వేదికగా ఆన్‌లైన్ శిక్షణలో పాల్గొననున్నారు.

ఉమ్మడి జిల్లాకు 26, 28 తేదీల్లో..

రాష్ట్రవ్యాప్తంగా 15 బ్యాచ్‌లను తయారు చేయగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఉపాధ్యాయులకు మే 26న 13వ బ్యాచ్‌లో ఆదిలాబాద్, నిర్మల్, 28న 14వ బ్యాచ్‌లో కుమురం భీం, మంచిర్యాల జిల్లాల ఉపాధ్యాయులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4:45 గంటల వరకు ఆరు సెషన్‌లలో సబ్జెక్టుల వారీగా తరగతులు కొనసాగుతాయి.

సిగ్నల్స్ లేక.. పాఠాలు వినక

కోవిడ్ కారణంగా అనేక మంది విద్యార్థులు చదువులో వెనుకబడి పోయారు. ఐటీడీఏ పరిధిలోని ఆన్‌లైన్ బోధనలకు అవరోధాలు ఏర్పడ్డాయి. ఉమ్మడి జిల్లాలో అనేక ప్రాంతాల్లో సిగ్నల్స్ లేకపోవడంతో చాలామంది ఆన్‌లైన్ తరగుతులకు దూరమయ్యారు. కొన్నిచోట్ల సిగ్నల్స్ ఉన్నప్పటికీ డేటా సరిపోక పోవడంతో మధ్యలోనే అంతరాయం ఏర్పడేది. చివరకు ఏపాఠం చెబుతున్నారో.. తామేం వింటున్నమో అనేంతగా విద్యార్థుల్లో గందర గోళం ఏర్పడింది. గత అనుభభవాలను దృష్టిలో పెట్టుకుని సిగ్నల్స్‌కు అంతరాయం లేకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శిక్షణలో పాల్గొనాలి

నేటికాలంలో ఏఐ విద్యాబోధన విద్యార్థులకు ఎంతో ఆవశ్యకమైంది. కాలానుగుణంగా బోధనలో మార్పులు తేవడానికి గిరిజన సంక్షేమ శాఖ ప్రయత్నాలు చేస్తోంది. ఐటీడీఏ పీవో ఆదేశానుసారంగా మేలో కొనసాగే ఏఐ టూల్స్ పై ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొనాలి. విద్యారంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలి. – పుర్క ఉద్దవ్, ఏసీఎంవో, కుమురంభీం

గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ఆశలు..

ఉన్న ఊర్లో ఉపాధిలేకనో.. గల్ఫ్ దేశాలకు వెళ్తే జీవనం మెరుగుపడుతుందనో.. తమ కుటుంబాలు బాగుపడతాయనో.. కారణం ఏదైనా కావచ్చు.. ఉమ్మడి జిల్లా నుంచి రెండు దశాబ్దాలకుపైగా ఎడారి దేశాలకు వలసలు క్రమంగా పెరుగుతున్నాయి. అయితే విధి నిర్వహణలో అనారోగ్యం రీత్యా, ప్రమాదాల బారిన పడి, అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించక.. పలుకారణాలతో మృత్యువాత పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. వారిపై ఆధారపడిన బాధిత కుటుంబాలు సామాజికంగా, ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్న పరిస్థితులు ఉమ్మడి జిల్లాలో కోకొల్లలు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే 15 రోజుల క్రితం ప్రత్యేక సలహా మండలిని ఏర్పాటు చేసింది. వారి జీవన విధానంపై అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పించింది. నేడు అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం సందర్భంగా కథనం.

- బాధిత కుటుంబాల భరోసాకు ప్రభుత్వం కార్యాచరణ
- ప్రత్యేక సలహా మండలి ఏర్పాటు
- నేడు అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం



స్వగ్రామంలో గల్ఫ్ కార్మికుడి మృతదేహం (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గల్ఫ్ దేశాలైన దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఇరాక్, ఇరాన్, కువైట్ తదితర దేశాలకు రెండు దశాబ్దాలకు ముందు నుంచే వలసలు ప్రారంభం అయ్యాయి. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 70 వేలకు పైగా మంది కార్మికులు వివిధ గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నట్లు సమాచారం. కాగా ఎక్కువమంది నైపుణ్య రహిత కార్మిక రంగంలోనే ఉపాధి పొందేందుకు వెళుతుండడంతో అక్కడి పరిస్థితులు అనుకూలంగా లేకపోవడం వల్ల అనారోగ్యం బారిన పడడం, ఒత్తిడికి గురికావడం, ప్రమాదాల బారిన పడటం వంటి అనేక కారణాలరీత్యా తనువు చాలిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం తీసుకునే విధానపరమైన నిర్ణయాలపై సలహాలు, సూచనలు అందించేందుకు ప్రత్యేక గల్ఫ్ సంక్షేమ సలహా మండలిని ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దీనికి విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి బిఎం వినోద్ కుమార్‌ను చైర్మన్‌గా, 12 మందిని సభ్యులుగా నియమించింది. ఇందులో నిర్మల్ జిల్లాకు చెందిన స్వదేశ్ పరికిపండ్లకు అవకాశం కల్పించింది. దీంతో ఉమ్మడి జిల్లాకు చెందిన గల్ఫ్ బాధిత కుటుంబాల్లో కాసింత భరోసా కల్పించినట్లు అయింది.

మృతుల కుటుంబాలకు పరిహారం..

గల్ఫ్ దేశాల్లో మృత్యువాత పడిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5 లక్షల పరిహారం అందజేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా నుంచి రెండు దశల్లో ఈ పరిహారం ఆయా బాధిత కుటుంబాల ఖాతాల్లో ఇప్పటికే జమ అయ్యాయి.

అమలుచేయాల్సినవి ఇవే..

- ఎన్నారై పాలసీ అమలు
- ఏజెంట్ల మోసాలకు అడ్డుకట్ట వేయడం
- ఎంబసీలో తెలుగు అధికారుల నియామకం
- మృతదేహాలను స్వస్థలాలకు తీసుకురావడం
- అంత్యక్రియలకు ఆర్థికసాయం
- బాధిత కుటుంబాలకు పరిహారం
- వివిధ కారణాలతో అక్కడి జైళ్లో మగ్గుతున్న కార్మికులకు న్యాయ సహాయం
- ప్రమాద ఆరోగ్య బీమా అమలు
- నైపుణ్య శిక్షణ కార్యక్రమాల నిర్వహణ
- తిరిగివచ్చిన కార్మికులకు పునరావాసం

నేడు నిర్మల్‌లో ప్రత్యేక కార్యక్రమం

అంతర్జాతీయ కార్మిక స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో ఉదయం 9 గంటలకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో గాయపడిన లేదా మృతి చెందిన, అంగవైకల్యం పొందిన కార్మికుల స్మారకార్థం ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ కార్మికుల స్మారక దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ‘చనిపోయిన వారిని స్మరించండి–బతికున్న వారికోసం పోరాడండి’ అనే నినాదంతో టీపీసీసీ ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో ‘అమరుల దినోత్సవం’ నిర్వహించనున్నట్లు గల్ఫ్ కార్మిక సంక్షేమ రాష్ట్ర సలహా మండలి సభ్యులు స్వదేశ్ పరికిపండ్ల తెలిపారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నస్పూర్: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మూన్ లైట్ బార్ బిల్డింగ్ సెల్లార్ కింద వాష్ రూమ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ ఆకుల అశోక్ తెలిపారు. బార్ యజమాని ఆదివారం సెల్లార్ కిందకు వెళ్లి చూడగా దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు నాలుగు రోజుల క్రితం మృతి చెందినట్లు ఉండన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి గుర్తు తెలియని స్థితిలో ఉందన్నారు. బార్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీ ఆధారంగా విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



రాకేశ్‌రెడ్డి (ఫైల్)

బోథ్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు ధన్నూర్(బి) గ్రామానికి చెందిన ముసుగు రాకేశ్‌రెడ్డి (37), ముద్దం రాజు ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బోథ్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా సాయినగర్ కాలనీ వద్ద పెట్రోల్ పంపు సమీపంలో ఎదురుగా వచ్చిన టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో 108లో బోథ్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిర్మల్ జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా రాకేశ్‌రెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

క్లుప్తంగా

మద్యం పట్టివేత

ఇచ్చోడ: బజార్‌హత్నూర్ మండల కేంద్రానికి చెందిన తోట త్రిశూల్ శనివారం రాత్రి మహారాష్ట్ర నుంచి నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ (సుంకం చెల్లించని మద్యం) తరలిస్తుండగా ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. పట్టుకున్న మద్యం విలువ రూ.19,200 ఉంటుందన్నారు. మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సెల్‌పాయింట్ దగ్ధం



పరిశీలిస్తున్న ఫైర్ అధికారి శ్రీనివాస్

జన్నారం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సెల్ పాయింట్ దగ్ధమైన సంఘటన మండలంలోని కలమడుగులో చోటు చేసుకుంది. బాధితుడు మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో తాళం వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో షాపు లోపలి నుంచి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇవ్వడంతో మంటలు ఆర్పివేశారు. ఆదివారం ఉదయం ఫైర్ అధికారి శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. ఘటనలో మొత్తం రూ.16 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

గంజాయి సేవిస్తున్న ఏడుగురు అరెస్ట్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం సబ్బేపల్లి శివారులో గంజాయి సేవిస్తున్న ఏడుగురిని ఆదివారం అరెస్టు చేసినట్లు హాజీపూర్ ఇన్‌చార్జి ఎస్సై రామయ్య తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించగా పోలీసుల రాకను గమనించిన ఏడుగురు వ్యక్తులు పారిపోయే ప్రయత్నం చేశారు. అందులో ఆరుగురిని పోలీసులు పట్టుకోగా ఒకరు పరారయ్యారు. వారి నుంచి 70 గ్రాముల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసీఆర్‌పై యువకుడి అభిమానం



కేసీఆర్ కటింగ్‌తో యువకుడు

తలమడుగు: మండల కేంద్రానికి చెందిన మాండ సంతోష్ కేసీఆర్‌పై తన అభిమానం చాటుకున్నాడు. తలపై కేసీఆర్, బీఆర్ఎస్ అక్షరాలు కనిపించేలా కటింగ్ చేయించుకుని ఆదివారం చలో వరంగల్ సభకు బయలుదేరి వెళ్లాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

తప్పుడు పత్రాలతో కొలువులు!



ఇతర రాష్ట్రాల చెందిన పలువురు యువకులు ఆదిలాబాద్ జిల్లా నివాస ధ్రువపత్రాలతో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించారు. ఎస్‌బీ పోలీసుల ద్వారా విషయం బయటకు పొక్కింది. 8లో▸



వేసవిలో జీవాలు పైలం

వేసవిలో పాడి పశువులు, జీవాల పోషణపై పోషకులు అప్రమత్తంగా ఉండాలి. పశువైద్యాధికారుల సూచనలు పాటించాలి. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
41.0/28.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

ట్రెయినీ కలెక్టర్‌గా సలోని చాబ్రా బాధ్యతలు



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న సలోని

కైలాస్‌నగర్: ట్రెయినీ కలెక్టర్‌గా నియామకమైన సలోని చాబ్రా సోమవారం విధుల్లో చేరారు. 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈమె కలెక్టర్ రాజర్షి షాను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్టు చేశారు. అనంతరం తాంసి మండల కేంద్రంలో నిర్వహించిన భూభారతి చట్టం అవగాహన సదస్సులో పాల్గొన్నారు.

నూతన సీఎస్‌ను కలిసిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



రామకృష్ణారావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావును ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించారు. నాడు ఆదిలాబాద్ కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఆయన వెంట అశోక్ ఉన్నారు.

సాయిచైతన్యను ఆదర్శంగా తీసుకోవాలి



సాయిచైతన్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిల్

తలమడుగు: యూపీఎస్సీలో సత్తా చాటి ఐఏఎస్‌కు ఎంపికైన నియోజకవర్గంలోని పల్సి (బి)కి చెందిన సాయిచైతన్యను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని పల్సి(బి) తండా గ్రామంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సాయిచైతన్యను సన్మానించారు. జాతీయ స్థాయిలో ఈ ప్రాంత కీర్తిని చాటడం అభినందనీయమన్నారు. ఇందులో గ్రామస్తులు పాల్గొన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ సెంటర్‌లో ఖాళీగా ఉన్న మెడికల్ ఆఫీసర్ పోస్టు భర్తీ కోసం అర్హత గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. మే 2న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు అదనపు కలెక్టర్ చాంబర్‌లో ఉదయం 11 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

నిరంతర సాధనతోనే కళల్లో ప్రావీణ్యం



విజేతలతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే కళల్లో ప్రావీణ్యం సాధ్యమని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాల కేంద్రంలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో భాగంగా బాల కేంద్రంలో అందజేస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇటీవల జాతీయ స్థాయిలో విజేతగా నిలిచిన పలువురు బాలకేంద్రం చిన్నారులను సన్మానించారు. ఇందులో బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి, తల్లిదండ్రుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం అందేనా?

జిల్లాలో..	
యూనిఫాం అందించే పాఠశాలలు:	1,145
కుట్టాల్సిన యూనిఫాం జతలు :	1,32,564
స్వయం సహాయక సంఘాలు :	10,756
ఆయా సంఘాల్లోని సభ్యులు :	1,16,885

- నెక్కర్ వస్త్రం వచ్చింది.. షర్ట్ బట్ట రాకపాయే
- ఏటా ఆలస్యమవుతున్న వైనం
- ఈ సారి కూడా అనుమానమే..
- బడి పునఃప్రారంభం నాటికి అందిస్తామంటున్న అధికారులు



యూనిఫాం కోసం విద్యార్థుల కొలతలు తీసుకుంటున్నారిలా.. (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు యూనిఫాం కుట్టించేందుకు విద్యాశాఖ చర్యలు చేపడుతోంది. అయితే పాఠశాలలు పునఃప్రారంభం నాటికి ఒక జత పంపిణీ చేయడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది ఆలస్యం కాగా ఈసారి ముందస్తుగానే నెక్కర్‌కు సంబంధించిన వస్త్రం వచ్చినప్పటికీ, షర్ట్ వస్త్రం ఇంకా రాలేదు. ఈ జాప్యం కుట్టుపై ప్రభావం పడనుంది. ఏటా బడులు తెరిచే నాటికి విద్యార్థులకు యూనిఫాం అందజేస్తామని అధికారులు చెబుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. అయితే తొలిరోజునే యూనిఫాం అందిస్తే విద్యార్థులు చిరిగిన డ్రెస్సులతో కాకుండా కొత్త బట్టలతో హుషారుగా బడిబాట పట్టే అవకాశం ఉంటుంది.

66,282 మంది విద్యార్థులకు..

జిల్లాలో యూనిఫాం అందించే ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో 66,282 మంది చదువుతున్నారు. ఇందులో బాలురు 31,780 మంది ఉండగా, బాలికలు 34,502 మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ఏటా రెండు జతల యూనిఫాం ఉచితంగా అందజేస్తుంది. గతంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఆధ్వర్యంలో కుట్టించి అందించేవారు. గతేడాది నుంచి స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టించి విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ కుట్టుకు సంబంధించిన బాధ్యతలను ప్రభుత్వం డీఆర్డీఏకు అప్పగించింది. వారు స్వయం సహాయక సంఘాల ద్వారా కుట్టించి పాఠశాలలకు అందజేయనున్నారు. గతేడాది మండలానికి సంబంధించి వస్త్రం రాగా, ఈసారి ఆయా పాఠశాలలకు సంబంధించి వస్త్రం వచ్చింది. దీంతో కొంత ఇబ్బందులు తప్పనున్నాయి. బట్ట సరిపోక గతేడాది టైలర్లు ఇబ్బందులు పడ్డారు. ఈసారి ఆ సమస్య లేదని అధికారులు చెబుతున్నారు.

పెరిగిన కుట్టు కూలి..

యూనిఫాంకు సంబంధించి ప్రభుత్వం కుట్టు కూలి పెంచింది. ఇదివరకు ఒక జతకు రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.75 చెల్లించనుంది. ఇదిలా ఉండగా 1 నుంచి 5వ తరగతి బాలురకు నెక్కర్, షర్ట్, 6 నుంచి 12వ తరగతి వారికి షర్ట్, ప్యాంట్, అలాగే 1 నుంచి 3వ తరగతి చదివే బాలికలకు స్కర్ట్, 4,5 తరగతుల వారికి షర్ట్, లహంగా, 6 నుంచి 12వ తరగతి విద్యార్థినులకు పంజాబీ డ్రెస్సు ఇవ్వనున్నారు.

కుట్టుడు షురూ..

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, విద్యా శాఖ అధికారులు యూనిఫాం కుట్టించడంపై దృష్టి సారించారు. ప్రతి మండలానికి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో ఎంపీడీవో, ఎంఈవో, ఏపీఎంలు ఉన్నారు. యూనిఫాం కుట్టడం ఎక్కడివరకు వచ్చిందనే వివరాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులతో కలిసి పర్యవేక్షిస్తారు. సకాలంలో పాఠశాలలకు అందేలా చూస్తామని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ ఏడాది నెక్కర్‌కు సంబంధించిన వస్త్రం వచ్చినప్పటికీ షర్ట్‌కు సంబంధించిన బట్ట రాకపోవడంతో కొంత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తోంది. గతేడాది టైలర్లకు మేలో వస్త్రం ఇవ్వగా, వారు ఒక జత జూలై, ఆగస్టు మాసాల్లో విద్యార్థులకు అందించారు. రెండో జత అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈసారి ఆ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడతామని అధికారులు పేర్కొంటున్నారు.

బడులు తెరిచేనాటికి అందిస్తాం..



పాఠశాలలు పునఃప్రారంభమైన మొదటి రోజు విద్యార్థులకు ఒక జత యూనిఫాం అందించేలా చర్యలు చేపడుతున్నాం. ప్యాంట్, లహంగాలకు సంబంధించిన వస్త్రం 31 శాతం వచ్చింది. జిల్లాకు మొత్తం బట్ట 2,71,420 మీటర్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు 84,022 మీటర్లు వచ్చింది. ఈ వస్త్రాన్ని స్వయం సహాయక సంఘాల ద్వారా టైలర్లకు అందించాం. త్వరలోనే షర్ట్ బట్ట కూడా రానుంది.

– సుజాత్ ఖాన్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

పార్టీ విధేయులకు పదవులు



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

- అందరికీ ఆమోదయోగ్యంగా డీసీసీ అధ్యక్షుడి ఎంపిక
- పీసీసీ జిల్లా పరిశీలకులు తాహెర్ బిన్ హందాన్, సత్యనారాయణ

కైలాస్‌నగర్: కాంగ్రెస్‌కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, పార్టీకి విధేయులుగా ఉన్న వారందరికి త్వరలోనే నామినేటెడ్ పదవులతో సముచితస్థానం కల్పిస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, పీసీసీ పరిశీలకులు తాహెర్‌బిన్ హందాన్, చిట్ల సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి వారు అతిథులుగా హాజరయ్యారు. తొలుత పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడారు. పార్టీ పరంగా జిల్లాకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి ఎంతో మంది జాతీయ నాయకులుగా ఎదిగారని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీని బూత్ స్థాయి నుంచి ప్రక్షాళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మే 3నుంచి 10వరకు ఆయా మండలాల అధ్యక్షుల ఎంపిక ఉంటుందన్నారు. ఒక్కో పదవికి మూడు పేర్లను పరిగణలోకి తీసుకుని నాయకులు కార్యకర్తల అభిప్రాయం మేరకు ఎంపిక చేస్తామన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసే ప్రతీ కార్యకర్తకు పదవులు వెతుక్కుంటూ వస్తాయని భరోసానిచ్చారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలందరికి ఆమోదయోగ్యంగా ఉండేలా మే 30లోపు డీసీసీ అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీలు కంది శ్రీనివాసరెడ్డి, ఆడె గజేందర్, శ్యాంనాయక్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గణేష్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీధర్, చంటి తదితరులు పాల్గొన్నారు.

3 బార్లు.. 61 దరఖాస్తులు

- నేడు లక్కీడ్రా

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణంలోని మావల, బెల్లూరి ప్రాంతాల్లో కొత్తగా బార్ల ఏర్పాటుకు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. పట్టణం విస్తరించిన తర్వాత కొత్తగా ఇక్కడ ఏర్పాటు చేస్తే వ్యాపారం జోరుగా సాగుతుందని అంచనాలతో పలువురు పోటీ పడుతున్నారు. జిల్లా కేంద్రంలో గతంలో 12 బార్లు ఉండగా, అందులో మూడు ఏడాదిన్నర క్రితం రెన్యూవల్‌కు నోచుకోక మూతపడ్డాయి. నష్టాలు చవిచూస్తున్నామని యాజమాన్యాలు రెన్యూవల్ చేసుకోలేదు. తాజాగా ప్రభుత్వం ఆ బార్లకు టెండర్‌కు ఆహ్వానించగా ఏకంగా 61 దరఖాస్తులు వచ్చాయి. ఎస్పీ అఖిల్ మహాజన్ ఇటు దాబాల్లో మద్యం సిట్టింగ్‌లను నిరోధించడం, సరిహద్దుల్లో దేశీదారు అరికట్టడం, బెల్టుషాపులపై విస్తృతంగా దాడుల నేపథ్యంలో తిరిగి బార్లకు ఆదరణ లభిస్తుందనే కోణంలో ముందుకొచ్చారని చెబుతున్నారు. దరఖాస్తు ఫీజు రూ.లక్ష ఉండగా, 61 దరఖాస్తులతో ప్రభుత్వానికి రూ.61లక్షల ఆదాయం సమకూరింది. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఉదయం 10గంటలకు లాటరీ పద్ధతిన బార్ల కేటాయింపు జరుగుతుందని, ఇందులో కలెక్టర్ రాజర్షిషా పాల్గొంటారని ఆదిలాబాద్ డీపీఈవో హిమశ్రీ తెలిపారు.

‘భూ భారతి’తో రైతులకు మేలు

- కలెక్టర్ రాజర్షి షా
- యాపల్‌గూడ, తాంసిలో అవగాహన సదస్సులు

ఆదిలాబాద్‌రూరల్: భూ భారతి చట్టంతో రైతులకు మేలు చేకూరుతుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో భూభారతి చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. నూతన చట్టంపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురు రైతులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు.

దహిగూడ పంప్‌హౌస్ పరిశీలన

అనంతరం మండలంలోని దహిగూడ పంప్‌హౌస్‌ను కలెక్టర్ పరిశీలించారు. నీటి సరఫరా తీరుపై ఆరా తీశారు. తాగునీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్ కుమార్, తహసీల్దార్ గోవింద్ నాయక్, ఎంపీడీవో నాగేశ్వర్, మిషన్ భగీరథ ఏఈ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

తాంసి: మండల కేంద్రంలోని రామేశ్వర ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. నూతన చట్టంతో పెండింగ్ భూసమస్యలు పరిష్కారం కానున్నట్లు తెలిపారు. ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. భూభారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ భోజారెడ్డి, ట్రెయినీ కలెక్టర్ సలోని, ప్రత్యేకాధికారి వెంకటరమణ, తహసీల్దార్ లక్ష్మి, ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఏవో రవీందర్,మాజీ జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, రాజు,మాజీఎంపీపీ శ్రీధర్‌రెడ్డి,రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవల కోసమే గ్రీవెన్స్

- ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకే ప్రజా ఫిర్యాదుల నిర్వహణ (గ్రీవెన్స్) చేపడుతున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వారం మొత్తం 15 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్

కానిస్టేబుల్ శ్రీనివాస్‌కు ప్రశంస

మాదకద్రవ్యాల నిర్మూలన, విధి నిర్వహణలో చాకచక్యంగా వ్యవహరించిన కానిస్టేబుల్ గామ శ్రీనివాస్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో ప్రశంసాపత్రం అందజేశారు.

ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టరీత్యా నేరం

ఆదిలాబాద్‌టౌన్: ర్యాగింగ్‌కు పాల్పడటం, మాదకద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రిమ్స్ ఆడిటోరియంలో మెడికోలకు ర్యాగింగ్, డ్రగ్స్, మాదకద్రవ్యాలు, ఈవ్‌టీజింగ్ అంశాలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వైద్యవిద్య అభ్యసిస్తున్న విద్యార్థులు జిల్లా కీర్తి ప్రతిష్టలు పెంపొందించాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు అత్యవసర సమయాల్లో షీ టీంను సంప్రదించాలన్నారు. ఇందులో డీఎస్పీ జీవన్‌రెడ్డి, టూటౌన్ సీఐ కరుణాకర్ రావు, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ శిబిరాలు

జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో 2 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం మే 1నుంచి 31వరకు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు. కరాటే, యోగా, వాలీబాల్, కబడ్డీ, క్రీడాంశాల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నార్నూర్ పోలీస్ స్టేషన్లలో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు సమీప పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 30 లోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 87126 59961లో సంప్రదించవచ్చు.

అస్మదీయులకే అందలం!

- క్రీడాశిక్షకుల ఎంపికలో ఇష్టారాజ్యం
- నచ్చినవారికి ‘వేసవి’ కేంద్రాల కేటాయింపు
- శిబిరాల్లో పారదర్శక శిక్షణపై నీలినీడలు

ఆదిలాబాద్: చిన్నారుల్లో క్రీడా నైపుణ్యాలు పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏటా వేసవి సెలవుల్లో నెల పాటు ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా ఈసారి సైతం వాటి ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 10 శిబిరాలకు అనుమతి ఇచ్చింది. అయితే క్షేత్రస్థాయిలో క్రీడా శిక్షకుల ఎంపికలో సంబంధిత అధికారులు పక్షపాత ధోరణితో వ్యవహరించారనే చర్చ సాగుతోంది. రాజకీయ నాయకులు, అధికారుల ఒత్తిళ్లకు తలొగ్గి నచ్చిన వారికి కేటాయించారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

మౌఖికంగానే శిక్షకుల ఎంపిక..

నిబంధనల ప్రకారం ఈ శిబిరాల ఏర్పాటుకు ముందుకు వచ్చే శిక్షకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రకటనలు జారీ చేయాలి. అయితే ఇవేమీ లేకుండానే తమకు నచ్చిన వారికి కేంద్రాలను కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడంతో అర్హులైన తాము నష్టపోయామని పలువురు శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది శిబిరాలకు మాత్రమే అనుమతి రాగా, ఇష్టారీతిన ఎంపిక చేయడంతో శిక్షణ కేంద్రాల సంఖ్య ఏకంగా 34 దాటింది. జిల్లాలోని ప్రతీ మండలానికి ఓ కేంద్రం ఏర్పాటు చేసినా 21 మండలాలకు ఒక్కో శిక్షణ కేంద్రం ఏర్పాటు అవ్వాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఒకే ఆటకు పలు ప్రాంతాల్లో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయడం గమనార్హం. ఒక్క ఆదిలాబాద్ రూరల్ మండలంలోనే ఏడు కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. మరోవైపు సిరికొండ, తాంసి, గాదిగూడ, భోరజ్, భీంపూర్, సాత్నాల మండలాలకు కేంద్రాలు లేవు. అన్ని ఆటలకు, మండలాలకు ప్రాధాన్యమిస్తే వివిధ క్రీడాంశాల్లో చిన్నారులకు మెరుగైన శిక్షణ అందేది. శిక్షకుల ఎంపిక కోసం స్పష్టమైన ప్రకటన విడుదల చేసి ఉంటే ఉత్సాహవంతులైన శిక్షకులు ముందుకు వచ్చే అవకాశం ఉండేదని పలువురు చర్చించుకుంటున్నారు.

నిర్వహణపై ఆందోళన..

శిక్షకుల ఎంపికలో తమకు నచ్చిన వారిని అందలం ఎక్కించడం విషయంలో శ్రద్ధ చూపిన అధికారులు శిక్షణ సమయంలో ఏ మేరకు పర్యవేక్షిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో శిక్షణ కేంద్రాలు హడావుడిగా జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా ప్రారంభించి తర్వాతి రోజుల్లో వాటిని నడపకుండా పలువురు శిక్షకులు నిర్లక్ష్యం వహించడంపై ‘సాక్షి’లో సైతం కథనాలు ప్రచురితమయ్యాయి. ఫలితంగా ఎంతో మంది చిన్నారులు వేసవి శిక్షణకు దూరమయ్యారు. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పలువురు క్రీడాకారులు, క్రీడాభిమానులు, తల్లిదండ్రులు, క్రీడా సంఘాల బాధ్యులు, శిక్షకులు అభిప్రాయపడుతున్నారు.



జిల్లా కేంద్రంలోని డీఎస్‌ఏ కార్యాలయం

ముందుకు వస్తే ఎంపిక చేస్తాం..

శిక్షణ కేంద్రాలు ప్రారంభమయ్యే ముందు ఎవరైనా శిక్షణ ఇవ్వడానికి ముందుకు వస్తే నిబంధనలకు అనుగుణంగా పరిగణలోనికి తీసుకుంటాం. ఈనెల 31వరకు దరఖాస్తులు అందించవచ్చు. శిక్షకుల ఎంపిక విషయంలో వ్యాయా మ ఉపాధ్యాయుల సంఘం, క్రీడా శిక్షకులతో చర్చించి నిర్ణయం తీసుకున్నాం.

– వెంకటేశ్వర్లు, డీవైఎస్‌వో

● ఒకే కోచ్‌కు రెండు కేంద్రాలు..

జిల్లా కేంద్రంలో ఒకే క్రీడకు సంబంధించి, రెండు వేర్వేరు ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఒకే శిక్షకునికి కేటాయించడం ఎంపికలో అధికారుల పక్షపాత ధోరణిని స్పష్టం చేస్తుంది. ఒకే సమయంలో రెండు ప్రాంతాల్లో శిక్షకుడు ఏ విధంగా శిక్షణ ఇవ్వడం సాధ్యమవుతుందో అధికారులకే తెలియాలి. శిక్షకునికి రూ.4వేల గౌరవ వేతనం అందజేస్తారు. అయితే ఎంపికలో పారదర్శకతకు పాతరేయడం అనుమానాలకు తావిస్తోంది.



ఒకే శిక్షకునికి రెండు కేంద్రాలు కేటాయించారిలా..

పారదర్శకత కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్

ఆదిలాబాద్: రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో పారదర్శకత కోసమే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించినట్లు సాట్స్ శిక్షకులు కామేశ్, జితేందర్ గుప్తా అన్నారు. వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్న శిక్షకులకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంపై సోమవారం అవగాహన కల్పించారు. శిక్షణ తీసుకోవాలనుకునే చిన్నారుల రిజిస్ట్రేషన్ అంచెలంచెలుగా పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఇందులో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడలఅధికారి పార్థసారథి, శిక్షకులు రాజు, రమేశ్, శ్రీధర్ పాల్గొన్నారు.



కోసుగూడలో గాలికి లేచిపోయిన ఇంటి పైకప్పు

ఈదురుగాలుల బీభత్సం

పలు మండలాల్లో సోమవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఇచ్చోడ మండలం కోసుగూడలో చిత్రం సీపతిబాయి, సోయం మనోహర్, ఆడ శివాజి, జల్లైజాకు, ఆత్రం తూర్పుబాయి, కుమురం దేవురావు చెందిన ఇళ్ల పైకప్పులు గాలికి లేచి పక్కన పడ్డాయి. గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. అలాగే సిరికొండ మండలంలోని పొన్న ఎక్స్ రోడ్డులో వీచిన ఈదురుగాలులతో సిడాం లక్ష్మిబాయికి చెందిన ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి.

– ఇచ్చోడ/సిరికొండ



పొన్న ఎక్స్‌రోడ్డులో ఓ ఇంటి పైకప్పు పరిస్థితి..

క్లుప్తంగా

అడవిపందుల దాడిలో ముగ్గురికి గాయాలు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో కొటగూడలో సోమవారం అడవిపందుల దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. కుమురం రవి, ప్రేమలత, రాజుబాయిలు ఉదయం 10 గంటల ఇంటి ముందు కూర్చొన్నారు. వీరిపై ఒక్కసారిగా అడవిపందులు వచ్చి దాడి చేయగా గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రేమలత, రాజుబాయిను మంచిర్యాలకు రెఫర్ చేశారు.

యువ రైతు కూడా..


గాయపడిన శేఖర్

కోటపల్లి: పంట కాపలా వెళ్లిన యువరైతు అడవి పందుల దాడిలో తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బోరంపల్లికి చెందిన దుర్గం శేఖర్‌కు రాంపూర్ శివారులో వరి పొలం ఉంది. అడవి పందుల బెడద కారణంగా ఆదివారం రాత్రి పంటకు కాపలాగా ఉండేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు అడవిపందులు ఒక్కసారిగా అతనిపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన తోటి రైతులు వెంటనే చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పాన్‌షాపుల్లో ఆకస్మిక తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఏఎస్పీ రాజేష్ మీనా, సీఐ ప్రవీణ్‌కుమార్

నిర్మల్‌టౌన్: ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్‌పేట్, శాంతినగర్, చైన్‌గేట్ సమీపంలోని పలు పాన్ షాపుల్లో నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీనా ఆధ్వర్యంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఓసీబీ పేపర్స్ లభ్యం కాగా, సాధారణంగా వీటిలో గంజాయితో చుట్టి కాల్చడానికి ఈ పేపర్లు వాడతారని ఏఎస్పీ తెలిపారు. దీనిపై విచారణ చేయిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ సేవించిన, రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఆర్ ఎస్సై రవి, ప్రొబేషనరీ ఎస్సై జుబీర్, సుప్రియ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నేరడిగొండ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని నారాయణపూర్ పంచాయతీ పరిధిలో గల జాతీయ రహదారి (మహబూబ్ ఘాట్) పక్కన గుర్తు తెలియని మృతదేహం ఉందని పంచాయతీ కార్యదర్శి అనూష సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. దీంతో ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, కొన్ని రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి మరణించి ఉంటాడని, అతని శరీర భాగాలు కుళ్లిపోయి అవి కూడా కొన్ని పుర్రె, కాలు,నడుము భాగాల ఎముకలు ఉండడంతో సేకరించినట్లు తెలిపారు. కార్యదర్శి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తప్పుడు పత్రాలతో కొలువులు!

- ఆదిలాబాద్ జిల్లా నివాస ధ్రువపత్రాలతో బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు
- ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల నుంచి దరఖాస్తులు
- నకిలీ సర్టిఫికెట్లు పొందిన ఇతర రాష్ట్రాల యువకులు
- ఇచ్చోడలో ముగ్గురిపై కేసు
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

సునీల్‌యాదవ్ తండ్రి రామనంద్ యాదవ్. అతనికి 2024 డిసెంబర్ 23న బీఎస్ఎఫ్‌లో ఉద్యోగం వచ్చింది. కాల్ లెటర్‌లో ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నివాసిగా అడ్రస్ ఉంది. కానీ ఇతను ఇక్కడ లేకపోవడం, గ్రామం నుంచి బీఎస్ఎఫ్, ఆర్మీలో ఉద్యోగం చేసేవారు లేరని గ్రామస్తులు తెలిపారు. సదరు వ్యక్తి ఇస్లాంనగర్ నుంచి నివాస ధ్రువీకరణ పత్రం పొంది ఉద్యోగంలో చేరడం గమనార్హం.

అభినవ్ యాదవ్ తండ్రి ప్రేమంత్‌హెచ్‌యాదవ్. ఇతడు ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో ఉంటున్నట్లు 2024 ఆగస్టు 14న నివాస ధ్రువపత్రం కోసం మీసేవ ద్వారా నంబర్(ఆర్‌సీ022411234864) దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు పరిశీలించి రిజెక్ట్ చేశారు. మరోసారి నిజామాబాద్ జిల్లా నుంచి మీ సేవ ద్వారా నంబర్ (ఆర్‌సీ 022511946191) ద్వారా దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు పరిశీలించి గతమార్చి 15న రిజెక్ట్ చేశారు.

ఇచ్చోడ: ఇతర రాష్ట్రాల నిరుద్యోగ యువకులు కొందరు ఆదిలాబాద్ జిల్లా నివాసులుగా తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలో ఇచ్చోడ, ఇంద్రవెల్లి, నేరడిగొండ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో నివాసముంటున్నట్లు నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు పొందారని సమాచారం. ఈ విషయం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ద్వారా బయటకు రావడంతో విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. తప్పుడు పత్రాలతో ఉద్యోగం పొందిన ముగ్గురిపై ఆదివారం ఇచ్చోడలో కేసు నమోదైంది. ఎస్‌బీ అధికారుల ఫిర్యాదు మేరకు సహాని సురాజ్, డాగ్ విజయ్, విశ్వకర్మలపై కేసులు నమోదు చేశారు.

మీసేవ ద్వారా దరఖాస్తులు

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కొంతమంది నిరుద్యోగ యువకులు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ గ్రామంలో నివాసముంటున్నట్లు దరఖాస్తులు చేసుకున్నారు. నివాస ధ్రువీకరణ పత్రాల కోసం ఆధార్, రేషన్ కార్డులు పాస్‌ఫొటోతో జిరాక్స్ పత్రాలు జతచేసి మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించి మీసేవ ద్వారా ధ్రువీకరణపత్రం జారీ చేస్తారు. కానీ ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తప్పుడు ఆధార్, రేషన్ కార్డులను సృష్టించి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది.


ఇస్లాంనగర్ నుంచి దరఖాస్తు చేసుకున్న ఇతర రాష్ట్రాల యువకుల జాబితా

భారీగా దరఖాస్తులు

ఇచ్చోడ మండలంలో భారీగా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. 2024 జూలై నుంచి 2025 ఫిబ్రవరి వరకు ఒక్క ఇస్లాంనగర్ గ్రామం నుంచే 189 మంది యువకులు దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇంతమంది దరఖాస్తులు చేసుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఇస్లాంనగర్ గ్రామ పంచాయతీ గతంలో కొకస్‌మన్నూర్ పంచాయతీలో ఉండేది. ఇటీవల సాథ్‌నంబర్, ఇస్లాంనగర్ గ్రామాలు కలిసి నూతన పంచాయతీగా ఏర్పాటైంది. ఇస్లాంనగర్‌లో మొత్తం జనాభా మూడు వందల లోపు ఉంటుంది. ఇక్కడ ఉన్నత చదువులు చదువకున్న వారిని సైతం వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. ప్రస్తుతం ఇస్లాంనగర్‌లో ప్రభుత్వ ఉద్యోగం చేసేవారు కూడా లేరు. అధికారులు ఆ దరఖాస్తులను రిజెక్ట్ చేశారే తప్ప, తప్పుడు ఆధార్, రేషన్‌కార్డులు ద్వారా నివాస ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకుంటున్నట్లు గుర్తించకపోవడం వారి తప్పిదం కనిపిస్తుంది.

రిజెక్ట్ అయిన నంబర్ ద్వారానే మార్ఫింగ్

అధికారులు రిజెక్ట్ చేసిన దరఖాస్తు నంబర్‌తో నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇతరుల పత్రాన్ని రిజెక్ట్ అయిన దరఖాస్తు పత్రం నంబర్ ఆధారంగా మార్ఫింగ్ చేసే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. గత కొన్నిరోజుల నుంచి మీసేవ కేంద్రాలు ఓటీపీ పద్ధతి ద్వారా నడుస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఓటీపీ ద్వారా మీసేవలో లాగిన్ కావచ్చు. ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్‌లో నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మంది నిజామాబాద్ జిల్లా మీసేవల నుంచి దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. దరఖాస్తులను రిజెక్ట్ తర్వాత కొందరు మీసేవ నిర్వాహకులు నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పూర్తిస్థాయిలో విచారణ జరిపితే అసలు నిందితులు బయటపడే అవకాశం ఉంది.

చర్యలు తీసుకుంటాం

తప్పుడు నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ పత్రాలు సృష్టించి ఉద్యోగాలు సాధించినట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ విషయమై విచారణ చేపట్టాలని స్థానిక తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశాం.

– వినోద్‌కుమార్, ఆర్డీవో

ఎస్టీపీపీకి పలు విభాగాల్లో బహుమతులు


బహుమతి అందుకుంటున్న అధికారి శ్రీనాథ్

జైపూర్: ప్రపంచ భద్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని డిపార్టుమెంట్ ఆఫ్ ఫ్యాక్టరీస్, రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్ అనే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్టీపీపీ సేఫ్టీ బృందం రెండు బహుమతులు గెలుపొందింది. సేఫ్టీ పోస్టర్ డ్రాయింగ్ కాంపిటీషన్‌లో శ్రీనాథ్ బహుమతి గెలుపొందగా, ఎస్టీపీపీ నాటిక బృందం రక్షణపై అవగాహన కల్పిస్తూ నాటికను ప్రదర్శించగా మరో బహుమతి గెలుపొందింది. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రాజగోపాల్‌రావు, డాక్టర్ సంజయ్ చతుర్వేది, హేమచంద్ర చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. డీజీఎం పంతులా, ఎస్ఈ సేఫ్టీ సురేశ్, డిప్యూటీ ఎస్సీ శ్రీనాథ్, పవర్‌మేక్ సేఫ్టీ అధికారి శ్రావణ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కుంటాల: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో రాజన్న సిరిసిల్లలో వుషు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. కుంటాలలోని విజయసాయి పాఠశాల విద్యార్థి జాదవ్ ఆర్యన్ సబ్‌జూనియర్ వుషు ఛాంపియన్ పోటీల్లో జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. తమిళనాడులోని తిరుచెంగోడేలో మే 26 నుంచి 31 వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


సాయిన్న మృతదేహం

సారంగపూర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన తొండకూరి సాయన్న (45) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో నిర్మల్ నుంచి స్వర్ణ గ్రామానికి వెళ్తున్నాడు. ఆటోను అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్ల కౌట్ల(బి) శాంతినగర్ మూలమలుపు వద్దకు చేరుకోగానే అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయం కాగా 108లో నిర్మల్ ప్రభుత్వ ఏరియాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సోమవారం తెల్లవారుజామున ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అనారోగ్యంతో బాలింత..


రజిత (ఫైల్)

కాసిపేట: అనారోగ్యంతో బాలింత మృతిచెందింది. మండలంలోని మల్కేపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మల్కేపల్లికి చెందిన పెరుగు రజిత(28), వెంకటేశ్ భార్యభర్తలు. పెళ్లయినప్పటి నుంచి రజిత సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 8న కరీంనగర్‌లోని ప్రతిమ ఆస్పత్రిలో రెండో కాన్పులో ఆమె బిడ్డకు జన్మనిచ్చింది. వారం రోజులు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి వచ్చింది. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. ఆస్పత్రిలో ఉండగానే మూడుసార్లు గుండె పోటు వచ్చినట్లు కుటుంబ సభ్యులు వైద్యులతో వాదనకు దిగినట్లు సమాచారం.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడు..


బాలస్వామి(ఫైల్)

నెన్నెల: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతిచెందినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..మండలంలోని కొత్తగూడం గ్రామానికి చెందిన యువకుడు దుర్గం బాలస్వామి(26) వ్యవసాయ పని కోసం తన సొంత ట్రాక్టర్‌తో సోమవారం నెన్నెలకు వస్తున్నాడు. ప్రమాదవశాత్తు ఒక్కసారిగా స్టీరింగ్ అదుపు తప్పి బోల్తాపడింది. ట్రాక్టర్ కింద బాలస్వామి శరీరం మొత్తం ఇరుక్కుపోయింది. గ్రామస్తులు వచ్చి అతడిని బయటకు తీసి 108లో బెల్లంపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి తమ్ముడు జీవన్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడికి భార్య ప్రసన్న, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా పల్సితాండకు చెందిన జాదవ్ మనోజ్ (38) రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందినట్లు టూటౌన్ ఏఎస్సై ఖైసర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పంట సాగు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనోజ్ మనస్తాపం చెంది ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌లో ఉదయం చేర్పించగా, రాత్రి మృతిచెందినట్లు పేర్కొన్నారు. మృతుడి భార్య జయశ్రీ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వివరించారు.

తండ్రి మందలించాడని కొడుకు ఆత్మహత్య


వివరాలు సేకరిస్తున్న ఎస్సై మనోహర్

ఉట్నూర్‌రూరల్: తండ్రి మందలించాడని కొడుకు షుగర్ మాత్రలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మండలంలో ఈఘటన చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం.. ఉట్నూర్‌లోని శాంతినగర్ కాలనీకి చెందిన చౌహాన్ రాంకుమార్ కుమారుడు చౌహాన్ సాయి (20) ఇంటర్ పూర్తి చేశాడు. అప్పటి నుంచి ఖాళీగా ఉంటున్నాడు. ఏదైనా పని చేసుకోవాలని తండ్రి మందలించాడు. క్షణికావేశంలో ఈనెల 26న రాత్రి ఇంట్లో అధిక మోతాదులో షుగర్ మాత్రలు మింగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని కుటుంబ సభ్యులు గమనించి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. తండ్రి రాంకుమార్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అప్పులు తీర్చలేక యువకుడు..


లక్ష్మణ్ (ఫైల్)

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామానికి చెందిన యువకుడు పిట్లివాడ్ లక్ష్మణ్ (25) అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం ..లక్ష్మణ్ గత రెండేళ్ల క్రితం రూ.2 లక్షల అప్పు తీసుకుని ఫైనాన్స్‌పై ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. కిరాయికి ట్రాక్టర్ నడవకపోవడంతో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేదు. దీంతో ట్రాక్టర్‌ను అమ్మి కిస్తీలు కట్టాడు. గతంలో తీసుకున్న రూ.2 లక్షల అప్పు ఎలా తీర్చాలనే బెంగతో మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం అర్ధరాత్రి అందరు నిద్రపోయాక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తల్లి లక్ష్మిబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కర్రెగుట్టలో కూంబింగ్ ఆపాలి


మాట్లాడుతున్న భుజంగ్‌రావు, రామారావు

ఉట్నూర్‌రూరల్: కేంద్రప్రభుత్వం చర్చలకు స్పందిస్తే మేము కూడా సిద్ధమేనని సీపీఐ మావోయిస్టు పార్టీ ప్రకటించినందున కర్రెగుట్టలో చేపట్టిన పోలీసుల కూంబింగ్ ఆపాలని శాంతి చర్చల కమిటీ రాష్ట్ర కోకన్వీనర్ ఆత్రం భుజంగ్‌రావు, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ బానోత్ రామారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తున్నామని తెలిపారు. 'ఆపరేషన్ కగార్'అంతర్యుద్ధాన్ని కేంద్రం మానుకోవాలన్నారు. నక్సలైట్ల హింసలో, పోలీసుల ఎన్‌కౌంటర్‌లో, ఉగ్రవాదుల కాల్పుల్లో సామాన్య ప్రజలు సమిధలు అవుతున్నారన్నారు. కర్రెగుట్టలో పోలీసులు చేపట్టిన కూంబింగ్‌తో ఆదివాసీ గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. పోలీసుల కాల్పుల చర్యలను విరమించుకోవాలని, శాంతి చర్చలకు అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నేతావత్ రాందాస్, బండి విజయ్‌కుమార్, దిలేశ్ చౌహాన్, జాదవ్ రాంకిషన్, పవార్ గంగారాం నాయక్ పాల్గొన్నారు.

వేసవిలో జీవాలు పైలం

- మేత, దాణా సరిపడా అందించాలి
- జాగ్రత్తలు తప్పనిసరంటున్న పశువైద్యాధికారి సతీశ్


సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల


ఎండలో ఉన్న జీవాలు

చెన్నూర్‌రూరల్: వేసవిలో పాడి పశువులు, జీవాల పోషణపై జాగ్రత్తలు తీసుకోవాలని కత్తెరసాల పశువైద్యాధికారి సతీశ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటల్లో.. పాడి పశువులకు వేసవిలో మేత, దాణాను సరిపడా అందించాలి. పచ్చిమేత దొరకని సమయంలో ఎండుమేత దీంతోపాటు ఎక్కువగా దాణాను ఇవ్వాలి. పశువులకు ఎల్లవేళలా పరిశుభ్రమైన చల్లని నీరు లభించేలా చూడాలి. మేత, నీరు సరిపడా ఉంటే పాడి పశువులు వేసవిలో కూడా పాలు బాగా ఇస్తాయి. ఎదకొచ్చి చూలు కడుతాయి. వేసవిలో పాల ధరలు పెరిగే అవకాశం ఉంది. ఈ సమయంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉంటే పాడి పరిశ్రమకు లాభదాయకం. దీనికోసం పశువుల షెడ్లు(కొట్టాల) వద్ద చల్లని వాతావరణం ఉండేలా చూడాలి. వీలైతే షెడ్లు(కొట్టాల)పై గడ్డిని కప్పి ఉంచాలి. షెడ్ల చుట్టూ తడికెలు, గోనె సంచులు కట్టి వాటిపై నీళ్లు చల్లాలి. పశువులపై మధ్యాహ్నం రెండు, మూడుసార్లు నీళ్ల చల్లితే మంచిది. గేదెలను చెరువులకు పంపి మధ్యాహ్నం కొంతసేపు అందులో ఉండనివ్వాలి. కొట్టాల చుట్టూ పెద్ద చెట్లు ఉంటే లోపల చల్లగా ఉంటుంది. ఈ పద్ధతుల్ని పాటిస్తే పాలు ఎక్కువగా ఉండటమే కాకుండా పశువులు ఎదకొచ్చి చూడి కడుతాయి. అలా అవి సంవత్సరం పొడవునా ఈని పాలిచ్చే అవకాశం ఉంటుంది. సాయంత్రం పాలు పితికే ముందు పశువును, పొదుగును చల్లని నీటితో కడిగితే మంచిది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వేసవిలో గొర్రెలు, మేకల్ని జత కలిపి చూడి కట్టించాలి. మూడు నెలల వయసు దాటిన పిల్లలను తల్లుల నుంచి వేరుచేయాలి. పిడుదులు, గోమార్లు లేకుండా మూడు వారాలకోసారి మందు కలిపిన నీటిలో గొర్రెలను తడిపి తీయాలి. అమ్మతల్లి(బొబ్బ, మశూచి) టీకాలు, చిటుక రోగం టీకాలను పిల్లలకు తప్పకుండా వేయించాలి. మధ్యాహ్నం పూట ఎండ వేడిమికి మేతకు బయట మేపకపోవడం మంచిది. బయట మేసే సమయంలో చెట్ల నీడ, తాగునీటి సదుపాయం ఉండేలా చూసుకోవాలి. నట్టల నివారణ మందులను పశువైద్యుడి సలహా మేరకు వినియోగించాలి. ఈ జాగ్రత్తలు పాటిస్తే వేసవిలో పశువులను, జీవాలను కాపాడుకోవచ్చు.

గిరిజనుల సమస్యలు సత్వరం పరిష్కరించాలి


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను ఖుష్బూ గుప్తా స్వీకరించారు. అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. పెంబి మండలం గుమ్మనా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని టేకం భీంరావ్, తాండూర్ మండలం కిష్టంపేట గ్రామస్తులు తమ ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏపీవో మెస్రం మనోహర్, ఏవో దామోదర స్వామి, ఈఈ తానాజీ, పీహెచ్‌వో సందీప్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మైనర్ బాలుడు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ కాలనీకి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలుడు పదేళ్లలోపు ఇద్దరు బాలురు, ఒక బాలికను నిర్బంధించాడు. తన నివాసానికి తీసుకెళ్లి తలుపు పెట్టి నిర్బంధించినట్లు డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఆ ముగ్గురి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన మైనర్ బాలుడిని అదుపులో తీసుకుని సోమవారం జువెనైల్ కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కిడ్నాప్ కేసుతోపాటు అక్రమ నిర్బంధం, పోక్సో కేసు, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మెరుగైన వైద్యం అందిస్తున్నాం

- సీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్


డిస్పెన్సరీని తనిఖీ చేస్తున్న కిరణ్ రాజ్‌కుమార్

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్/రామకృష్ణాపూర్: సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు కంపెనీ దవాఖానాల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నామని సింగరేణి చీఫ్ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ) కిరణ్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలో పర్యటించారు. ఆర్కే 8 డిస్పెన్సరీ, నస్పూర్ డిస్పెన్సరీ, మందమర్రిలోని కేకే డిస్పెన్సరీ, రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆస్పత్రులను సందర్శించారు. వార్డులను సందర్శించి వైద్య సేవలు, చికిత్సపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్‌తో కలిసి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వేసవి దృష్ట్యా ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత వచ్చిన ఆయనను ఆయా ప్రాంతాల్లో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఫైనాన్స్) బీభత్సా, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీవైసీఎంఓ రమేశ్‌బాబు, ఏరియా రక్షణ అధికారి శ్రీధర్ రావు, పర్చేస్ అధికారి చంద్రశేఖర్, వైద్యులు వేద వ్యాస్, మురళీధర్, లోక్నాథ్ రెడ్డి, ఎస్టేట్ అధికారి వరలక్ష్మి, ఐఈడీ ఎస్ఈ కిరణ్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు వైద్యసేవలు

జైపూర్: పవర్ ప్లాంట్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆవరణలో డిస్పెన్సరీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిస్పెన్సరీలో వసతులు, ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. డాక్టర్ రవీందర్, శ్యామల ఉన్నారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌అర్బన్: హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదుతోపాటు రూ.50 వేల జరిమానా విధిస్తూ సోమవారం జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవి. రమేశ్ తీర్పునిచ్చారు. తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని ఉల్లిపిట్ల గ్రామానికి చెందిన బోరకుంట మల్లయ్య (65) వ్యవసాయం చేస్తూ తనకు ఉన్న పాత ఇంట్లో ఒక్కడే ఉంటున్నాడు. అతనికి ముగ్గురు కుమారులు శ్యాంరావ్, సోమయ్య, గణపతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తనకు ఉన్న ఐదెకరాల్లో 2.5 ఎకరాలు ముగ్గురు కుమారులకు సమానంగా పంచారు. కుమారుడు సోమయ్య తండ్రి పేరిట ఉన్న 2.5 ఎకరాల్లో సాగు చేస్తున్నాడు. తండ్రిని పోషిస్తూ మిగిలిన డబ్బులు ఇస్తున్నాడు. చిన్న కుమారుడు గణపతి వృత్తిరీత్యా మహారాష్ట్రలో నివాసం ఉంటున్నాడు. తన అవసరాల నిమిత్తం అప్పుడప్పుడు స్వగ్రామానికి వస్తూ వెళ్తుండేవాడు. తండ్రి పేరిట ఉన్న భూమిని ఎప్పటి నుంచో ఆశిస్తున్నాడు. భూమి ఇవ్వకుంటే తండ్రిని చంపేస్తానని, బాబాయ్ అయిన పాపయ్యకు చెప్పేవాడు. 2022 ఏప్రిల్ 18న తండ్రితో గొడవపడి, ఆస్తి పంచి ఇవ్వలేదని కోపంతో కర్రతో కొట్టి హత్యచేశాడు. శ్యాంరావ్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమేశ్ కేసు నమోదు చేశారు. రెబ్బెన సీఐ బుద్దె స్వామి, తిర్యాణి ఎస్సై శ్రీకాంత్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ జగన్మోహన్‌రావ్ నేరం రుజువు చేశారు. నిందితుడు గణపతికి శిక్ష ఖరారు చేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన పీపీతోపాటు, కోర్టు ఆసిఫాబాద్ డివిజన్ లైసెనింగ్ రాంసింగ్, ఏఎస్పీ చిత్తరంజన్, సీఐ, ఎస్సై, కోర్టు సిబ్బంది కానిస్టేబుల్ వినోద్‌లను ఎస్పీ డీవీ. శ్రీనివాస్‌రావు అభినందించారు.

తప్పుడు సర్టిఫికెట్ పొందిన వ్యక్తిపై కేసు

ఇంద్రవెల్లి: తప్పుడు నివాసం సర్టిఫికెట్ పొందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన మనోజ్ షెకావత్.. సహస్ర సీమ బాల్ (ఎస్ఎస్‌బీ)లో ఉద్యోగం కోసం 2023లో ఇంద్రవెల్లిలో నివాసం ఉంటున్నాడు. కొందరి సహకారంతో నివాసం సర్టిఫికెట్ పొందాడు. అధికారులు రీవెరిఫికేషన్‌లో ఇక్కడ నివసించలేదని తేలడంతో అతనిపై సుమోటోగా సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అతనికి సహకరించిన వారిపై విచారణ చేపడుతామన్నారు.